ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తెరుచుకోని బడి

◆ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పిల్లల అవస్థలు ◆ ఒకటో తరగతిలో చేర్పింపుపై ఆసక్తి చూపని తల్లిదండ్రులు
◆ సెలవు పెడితే తరగతులకు కష్టం ◆ తరగతులు, ఉపాధ్యాయుల కుదింపుపైనే ప్రభుత్వ దృష్టి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పెదబయలు, మునగపాక, అనకాపల్లి విలేకరులు

ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని పెదబయలు మండలం, ఇంజరి పంచాయతీ కోండ్రూమ్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు నుంచి ఐదు తరగతి పివిటిజి పిల్లలు 11 మంది వున్నారు. పాఠశాలలు ఈ నెల 12 నుంచి పున:ప్రారంభించినప్పటికీ ఇక్కడ పనిచేస్తున్న సింగిల్ టీచర్ మే నుంచి నవంబరు వరకు మెటర్నటీ లీవ్ పెట్టడంతో ఇంతవరకూ పాఠశాల తెరచుకోలేదు. టీచర్ లేకపోవడంతో ఒకటో తరగతి పిల్లలను ఇంకా చేర్పించుకోలేదు.



మునగపాక మండలం అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాల (ఫైల్)

అనకాపల్లి జిల్లా, మునగపాక మండలం, అంబేద్కర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల ఎస్‌సి కుటుంబాల పిల్లలు 23 మంది చదువుకుంటున్నారు. సింగిల్ టీచర్ పనిచేస్తున్నారు. ఫ్యాన్లు పనిచేయకపోవడంతో సర్పంచ్ సమక్షంలో డబ్బులు ఎత్తుకొని ఫ్యాన్లు సమకూర్చుకున్నారు. ఎలక్ట్రికల్ మరమ్మతులు చేయించుకున్నారు. ఎనిమిది మంది పిల్లలతో ప్రారంభమైన స్కూల్ ప్రస్తుతం 23కు చేరుకుంది.

తుమ్మపాల ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులను 2021లో ఉన్నత పాఠశాలలో విలీనం చేసే నాటికి 47 మంది వున్నారు. సింగిల్ టీచర్ ఉండడంతో అక్కడ ఇప్పుడు ఒకటి, రెండు తరగతుల పిల్లలు ఏడుగురు వున్నారు. ఇక్కడ సింగిల్ టీచర్ వుండడంతో ఈ పాఠశాలలో ఒకటో తరగతి పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తిచూపలేదు.

ఇవే కాదు.. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 822 ఏకోపాధ్యాయ టీచర్ పాఠశాలల పరిస్థితి దాదాపు ఇలానే వుంది. పాడేరు ఏజెన్సీకి ఒకప్పుడు పరిమితమైన ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరిగాయి. గతంలో వంద వరకున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యా సంస్కరణలతో జరిగిన తరగతులు, పాఠశాలల విలీనంతో 822కు చేరాయి. వీటిలో ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో 389, పాడేరు డివిజన్‌లో 360, విశాఖ జిల్లాలో 73 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి.

98 మంది కంటే విద్యార్థులు తక్కువగా వున్నారని 199 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 410 సబ్జెక్టు టీచర్ పోస్టులను, 20 మందిలోపున్న 822 ప్రాథమిక పాఠశాలల్లోని రెండో టీచర్ పోస్టును ప్రభుత్వం రద్దు చేసింది. 23 మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలో రెండో టీచర్ వుండాలని ప్రభుత్వ మిగతా 2లో..

తుమ్మపాల సుగర్స్ అమ్మకాన్ని సహించం

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత సిఎం జగన్మోహన్‌రెడ్డి, స్థానిక మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు అనకాపల్లిలో జరిగిన సభలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి తెరిపిస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతర కాలంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా నేటికీ అతీగతీ లేదన్నారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీకి ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. సుమారు 12 వేల మంది రైతుల పెట్టుబడితో ఏర్పడిందని తెలిపారు. నేడు ఈ ఫ్యాక్టరీ సుమారు రూ.300 కోట్లు విలువ చేసే ఆస్తులను కలిగి ఉందని అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాల్యూయేషన్ కమిటీ ఏర్పాటు చేసి అమ్మకానికి పెట్టడమంటే రైతులను మోసం చేయడమే అవుతుందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరిని రైతులు, కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. రైతులతో మహాజన సభ నిర్వహించకుండా, వారి అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా వాల్యూయేషన్‌కి ఇవ్వడం ఎంత వరకు సమంజసమని



మాట్లాడుతున్న లోకనాథం

ప్రశ్నించారు. రైతుల పెట్టుబడితో ఏర్పడిన సహకార ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఎలా అమ్ముతుందన్నారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసే 350 మంది కార్మికుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. విడిపోయిన జిల్లాలో సహకార చక్కెర ఫ్యాక్టరీలు చాలా కీలకమైనవని తెలిపారు. వాటిని పరిరక్షించాల్సింది పోయి అమ్మకానికి పెట్టడమంటే రైతులకు, కార్మికులకు, జిల్లా ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలన చేసి చక్కెర ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

▶ వార్త 2లో..

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరసన

▶ వార్త 2లో..

స్వామీజీ ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి

▶ వార్త 4లో..



సోదాలు నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు

ఎస్‌ఇబి సిఐ నివాసంలో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్‌ఇబి) సిఐ పెద్దకాపు శ్రీనివాసరావు ఇంటిలోనూ, ఆయన బంధువుల ఇళ్లలోనూ ఎసిబి అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. విశాఖ అర్బన్‌లోని విశాలాక్షినగర్‌లో శ్రీనివాసరావు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నట్టు తెలిసి ఒక్కసారిగా అక్కడ ఎసిబి అధికారులు దాడులు చేశారు. రూ కోటికిపైగా ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు సంపాదించినట్టు గుర్తించారు. ఈ దాడులు ఎసిబి శ్రీకాకుళం జిల్లా డిఎస్‌పి బివిఎస్ఎన్.రమణమూర్తి ఆధ్వర్యంలో సాగాయి. నిందితుడు శ్రీనివాసరావు గత నెలలో శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం, నిద్దాం గ్రామానికి చెందిన మద్యం గొలుసు దుకాణం నిర్వాహకుడిని మిగతా 2లో..

అప్పుడు వాడితే.. ఇప్పుడు షాక్..!

◆ విద్యుత్ ఛార్జీల అదనపు బాదుడు
◆ నెల బిల్లుపై రూ.250 నుంచి రూ.350 వరకూ అదనం
◆ కూలి డబ్బులన్నీ కరెంట్‌కే కట్టాలా ? : పలువురు గృహిణుల ఆగ్రహం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలన్నీ పైపైకి ఎగబాకుతున్న తరుణంలో కరెంట్ ఛార్జీల మోత మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజానీకాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. ఇంట్లో రెండు ఫ్యాన్లు, టీవీ ఉన్నా బిల్లు మోత రూ.600 వరకూ ఉంటోంది. విశాఖ నగరంలో పేదలు నివసించే కెఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, జోడుగుళ్లపాలెం, సుభాష్‌నగర్ మిగతా 2లో..

రెండింతలు బిల్లులు వస్తున్నాయి



కరెంట్ బిల్లు గతంలో రూ.700 నుంచి రూ.900 వరకూ వచ్చేది. ఈసారి మే నెలలో రూ.1670 వచ్చింది. మా ఇంట్లో మూడు బల్బులు, రెండు ఫ్యాన్లు, ఒక టివి, ఫ్రిజ్ ఉన్నాయి. అదనంగా ఈ నెల రూ.1000 వచ్చింది. గతంలో రూ.1000కి మించి కరెంట్ బిల్లు ఎప్పుడూ రాలేదు. ప్రజల సహనాన్ని ప్రభుత్వం పరీక్షిస్తోంది. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలను సర్కారు పెంచేస్తోంది. మరోవైపు విద్యుత్ భారాలు మోపుతోంది. అదనపు ఛార్జీలను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

ఇండ్ల హేమలత, కెఆర్ఎం కాలనీ

వామ్మో.. రూ.3600 కరెంట్ బిల్లా ?



మా ఇంట్లో 3 బల్బులు, ఫ్రిజ్, 3 ఫ్యాన్లు ఉన్నాయి. గతంలో రూ.1000 నుంచి రూ.1200 బిల్లు వచ్చేది. ఇప్పుడు రూ.3600 బిల్లు వచ్చింది. ఇంత మొత్తంలో అదనపు ఛార్జీలను వసూలు చేస్తే మేం ఎలా బతకగలం. రోజంతా కష్టపడి సంపాదించిన కూలీ కరెంట్ బిల్లులకే సరిపోయేలా ఉంది. ప్రభుత్వం ఈ బిల్లుల భారాన్ని తగ్గించాలి.

జర్రా కొండమ్మ, మద్దిలపాలెం

మొదటి పేజీ తరువాయి..

తెరుచుకోని బడి

నిబంధనలు చెబుతున్నప్పటికీ వాటిని అమలుచేయలేదు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్ ఏ కారణంగానైనా రాకపోతే సిఆర్‌పిగానీ, ఇద్దరు టీచర్లున్న పక్క స్కూళ్ల నుంచిగానీ టీచర్‌ను సర్దుబాటు చేస్తామని చెప్పడం తప్ప తరగతులు జరిగేలా చూడ్డంలేదు. ఏజెన్సీలోని కోండ్రూమ్ పాఠశాల ఉపాధ్యాయరాలు మే నుంచి మెటర్నటీలీవ్‌లో వున్నా, ఇప్పటికీ టీచర్‌ను సర్దుబాటుచేయలేదు. దీంతో టీచర్‌లేక... గిరిజన పిల్లలు పాఠశాలకు వెళ్లడంలేదు. ఏకోపాధ్యాయ పాఠశాలలన్నింటా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలుచేస్తున్న సంస్కరణలతో ప్రభుత్వ బడులు బలహీనపడుతున్నాయి. పేదలకు అందుబాటులోవున్న పాఠశాలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. విద్యారంగంపై పెడుతున్న ఖర్చులను తగ్గించుకొనే క్రమంలో పాఠశాలలు, తరగతులను విలీనం చేయడం, విద్యార్థులు తక్కువున్నారని ఉపాధ్యాయులను తగ్గించడం వంటి చర్యలకు ప్రభుత్వం దిగుతోంది. విద్యార్థులు తక్కువున్నారని ఉపాధ్యాయులను తగ్గిస్తున్న ప్రభుత్వం, ఎక్కువున్న చోట మాత్రం నియమించడంలేదు. దళిత పిల్లలు చదువుతున్న అంబేద్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లను నియమించకుండా, ఒక్క టీచర్‌తో కాలంనెట్టుకురావాలని చూస్తోంది.

అప్పుడు వాడితే.. ఇప్పుడు షాక్..!

వంటిచోట్ల కరెంట్ బిల్లుల బాదుడు మామూలుగా లేదు. దీంతో జనం లబోదిబోమంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి విద్యుత్ అదనపు ఛార్జీలనూ వసూలు చేయడం లేదంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నుంచి దిగువ వరకూ మంత్రులూ, ఎంఎల్‌ఎలూ చెబుతున్న సంగతి తెలిసిందే. కానీ ప్రతి నెలా వినియోగదారులను దొంగదెబ్బ కొడుతూనే ఉన్నారు. రకరకాల పేర్లతో ఈ విద్యుత్ ఛార్జీల అదనపు దెబ్బ తగులుతోంది. ఇది వరకూ ప్రభుత్వం కొనుగోలు చేసిన విద్యుత్‌లో వ్యత్యాసాన్ని వినియోగదారుల నెత్తిన 'ట్రూఅప్ ఛార్జీలు' పేరుతో మోపుతోంది. ఉదాహరణకు 2014-2019 మధ్య కాలంలో వ్యత్యాసాన్ని, 2021 మే నెలలో తేడాను వినియోగదారుల నుంచి ఇప్పుడు వసూళ్లు చేయడం కనిపిస్తోంది. ఎపిఇఆర్‌సి (విద్యుత్ నియంత్రణ మండలి) ఈ అదనపు వ్యయం ఏదైతే ఉందో మరుసటి నెలలోనే వసూలు చేసే అవకాశం కల్పించడంతో వినియోగదారులపై ఈ భారం పడుతోంది. వినియోగదారులు వాడే విద్యుత్ యూనిట్ ఛార్జీలకు వాడకం అలాగే డిమాండ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ట్రూఅప్, కొత్తగా ఫ్యూయల్ పవర్ పర్చేస్ కాస్ట్ సర్దుబాటు ఛార్జీలను కలిపితే ప్రతి ఒక్క వినియోగదారునిపైనా రూ.250 నుంచి 300 వరకూ ఈ అదనపు భారం పడుతోంది.

ఎస్‌ఇబి సిఐ నివాసంలో ఎసిబి సోదాలు

ఓ కేసు నుంచి తప్పించేందుకు రూ 15 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని బతిమిలాడినా వినలేదు. ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో గొలుసు దుకాణం నిర్వాహకుడు ఎసిబి అధికారులను సంప్రదించాడు. శ్రీకాకుళం ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి సూచనల మేరకు ఎసిబి అధికారులు ఇచ్చిన రూ.500 నోట్లు తీసుకొని మద్యం గొలుసు దుకాణం నిర్వాహకుడు పొందూరు ఎస్‌ఇబి స్టేషన్‌కు వచ్చాడు. స్టేషన్‌లో సిఐ శ్రీనివాసరావు లేకపోవడంతో ఆయనకు ఫోన్ చేసి వాయిస్ రికార్డు చేశాడు. తీసుకు వచ్చిన రూ.15 వేలను ఎస్‌ఐ మురళీకి అందించాలని శ్రీనివాసరావు సూచించారు. ఆ నగదును అందిస్తుండగా అప్పటికే కాపు కాసిన ఎసిబి అధికారులు పట్టుకున్నారు. సిఐ శ్రీనివాసరావు ఫోన్ వాయిస్ రికార్డు ఆధారంగా విశాలాక్షినగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల మొదటి వారంలో జైలుకూ తరలించారు. అప్పటి నుంచీ ఎసిబి అధికారులు శ్రీనివాసరావు ఆస్తులపై నిఘా ఉంచారు. దీనిలో భాగంగానే శుక్రవారం సోదాలు జరిగాయని ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి తెలిపారు. గతంలో సిఐ శ్రీనివాసరావు పాడేరులో విధులు నిర్వర్తించినప్పుడు గంజాయి రవాణాలో స్మగ్లర్లకు సహకరించినట్టు తేలడంతో ఒక ఏడాది జైల్లో ఉన్నట్లు వెల్లడించారు. శుక్రవారం జరిగిన ఎసిబి దాడుల్లో శ్రీకాకుళం ఎసిబి సిఐలు భాస్కర్, హరి, సతీష్, ఎస్‌ఐలు చిన్నంనాయుడు, సత్యారావు పాల్గొన్నారు.

రథయాత్ర ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీలో పది రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బాలలకు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం పరిశీలించారు, అనంతరం క్యూ లైన్లులో వచ్చే పిల్లలకు దేవస్థానం ఏర్పాటు చేసిన వేడి పాలు, బిస్కెట్లు పంపిణీని ప్రారంభించారు. అనంతరం చంటి బిడ్డలతో హాజరయ్యే తల్లులకు, ఐదేళ్లలోపు బాలలకు, వికలాంగ బాలలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లను పరిశీలించారు. చంటి పిల్లలకు తల్లులు పాలు పెట్టే ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణానందను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బాలికపై అత్యాచారానికి పాల్పడిన వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమ నిర్వాహకులు పూర్ణానంద స్వామిని కఠినంగా శిక్షించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు నూకరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ ద్రోహంపై ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం జివిఎంసి పరిధిలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరణ చేయాలని, పెంచిన వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్‌లకు, ఫార్మాసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, ఎఎన్‌ఎంలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వేతనాలు పెంచినట్లు పెంచి, తగ్గించిందన్నారు. ఈ ఏడాది మే 2న విడుదల చేసిన జిఓ 60 ప్రకారం పై క్యాటగిరీ ఉద్యోగులకు వేతనాలు పెంచిందన్నారు. స్టాఫ్ నర్స్‌లకు రూ.32 వేలు, ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, ఎఎన్‌ఎంలకు రూ.27 వేలు వేతనం పెంచిందన్నారు. మళ్లీ అదే నెల 11న జిఓ 64 విడుదల చేసి, పెంచిన వేతనాలను తగ్గించిందన్నారు. ఇది చాలా అన్యాయమన్నారు. ఈ నిరసన కార్యక్రమాలకు జెఎసి నాయకులు వీరబ్రహ్మం, గోపి, కెసిహెచ్ నాగరాజు, జి.రమణబాబు, బి.దినేష్, శ్రీలత, భాగ్య,దేవి, ఆదిలక్ష్మి నాయకత్వం వహించారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్ రోడ్‌లో ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి నోవాటెల్ ఎదురుగా ఉన్న పిల్లల పార్కు వరకు నిర్వహించిన ఈ రన్‌ను విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పిజివిఆర్.నాయుడు (గణబాబు) ప్రారంభించారు. వందలాది మంది క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు, కోచ్‌లు, పిఇటిలు, ఎస్‌ఐ అకాడమీ విద్యార్థులు, వివిధ సంఘాల వారు పాల్గొన్నారు. ఎయు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ మోహన్, ఒలింపిక్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అచ్యుతా రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు డాక్టర్ ప్రసన్నకుమార్ అధ్యక్షతన సభ నిర్వహించారు.

ఎమ్మెల్యే గణబాబు, అతిథులు చేతుల మీదుగా జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన 70 మందికిపైగా క్రీడాకారులను సత్కరించారు. అలాగే ఒలింపిక్ అసోసియేషన్‌కు సుదీర్ఘ కాలం సేవలందించిన కార్యదర్శులు బి.రామయ్య (బాస్కెట్ బాల్), ఆర్.వెంకటరావు (బాల్ బ్యాడ్మింటన్)లను కూడా సత్కరించారు. ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08588 విశాఖపట్నం - బెనారస్ వీక్లీ స్పెషల్ రైలు విశాఖపట్నం నుంచి జూలై 5, 12 తేదీలలో మధ్యాహ్నం 12:30 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16:30 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. 08587 బెనారస్ - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ జూలై 6, 13 తేదీలలో సాయంత్రం 18.00 గంటలకు బెనారస్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. 03357 బరౌని జంక్షన్ - కోయంబత్తూరు వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు జూలై 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకూ ప్రతి శనివారం రాత్రి 23:45 గంటలకు బరౌని జంక్షన్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 03:00 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 03.20 గంటలకు బయలుదేరి మంగళవారం తెల్లవారుఝామున 04.00 గంటలకు కోయంబత్తూరు చేరుకుంటుంది.

03358 కోయంబత్తూరు - బరౌని జంక్షన్ వీక్లీ స్పెషల్ రైలు జూలై 5 నుండి అక్టోబర్ 14 వరకు ప్రతి బుధవారం (మంగళవారం అర్ధరాత్రి) 12:50 గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి అదేరోజు అర్ధరాత్రి 23:15 గంటలకు విశాఖ చేరుకొని మరలా 23:35 గంటలకు బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 06:00 గంటలకు బరౌని జంక్షన్‌కు వెళ్తుంది.

వెంకటేశ్వర మెట్ట భూములపై ఆంక్షలు తగవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం 33వ వార్డులోని వెంకటేశ్వర మెట్ట సర్వే నెంబరు 1450పై ఉన్న ఆంక్షలను దేవాదాయ శాఖ ఎత్తివేయాలని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సుమారు 500 కుటుంబాలు 150 సంవత్సరాలకుపైగా పక్కా డాక్యుమెంట్లతో వెంకటేశ్వర మెట్టపై నివాసం ఉంటున్నాయని చెప్పారు. అయితే ఆ స్థలం దేవాదాయ శాఖకు చెందినదని ఆ శాఖ అధికారులు పలుమార్లు నోటీసులు ఇవ్వడం దారుణమని అన్నారు. ఆ స్థలంపై దేవాదాయ శాఖకు ఎటువంటి అధికారమూ లేదని గతంలోనే నిరూపితమైందన్నారు.

ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : జడ్డంగి చైతన్య నగర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు కూలి సొమ్ము చెల్లించాలంటూ శుక్రవారం ఉపాధి పని ప్రదేశంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీ తెడ్ల రాంబాబు మాట్లాడుతూ తాము 6 వారాలుగా ఎండనక, వాననక కష్టపడి చమటోర్చి ఉపాధి పనులు చేసినప్పటికీ నేటికీ కూలి సొమ్ములు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిరుపేద కూలీలమని, రెక్కాడితేనే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నామని అన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
O.S.200/2017

Between
Sanku Nagamma and others ...Plaintiffs
And
Sanku Somulu and others ...Defendants

To Defendant No.5 by way of publication

To
D.Savitri
w/o Not Known,
Akkayapalem,
Visakhapatnam District.

Please take notice that the above named Plaintiff filed the above suit against you for partition of plaint suit schedule properties, and the same is posted to **10/07/2023** for your appearance on that day 10.a.m. you are appear in person or through an Advocate failing which the matter will be decided in your absence.

PANGA SRINIVASARAO
Advocate
D.No.13-13-41 Near Z.p.p.
Compost Road, Srikakulam
Cell : 9440255397, 8555944123

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1352/2022

Between:
State Bank of India, SME Centre,
Collectorate Compound, Maharanipeta,
Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And:
M/s. Visakha Steel Enterprises,
Rep. by its Proprietrix:
Smt. Ommi Omkarini & Another ...Defendants

SUMMONS

To,
D-1: M/s. Visakha Steel Enterprises,
Rep. by its Proprietrix:
Smt. Ommi Omkarini,
W/o. Ommi Eswar Rao, D.No.50-44-7/4,
P & T Colony, Gandhi Nagar,
Satyam Junction, Visakhapatnam-18.
D-2: Smt. Ommi Omkarini,
W/o. Ommi Eswar Rao, Hindu,
aged 35 years, R/at D.No.9-408,
Ramalayam Street,
Near Doctor Raju Clinic,
Visalakshi Nagar, Visakhapatnam-530043

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **04-08-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **04-08-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI, Advocate
Visakhapatnam. **Cell: 7396518669.**

IN THE HONOURABLE COURT OF THE DISTRICT CONSUMER COMMISSION AT SRIKAKULAM.
C.C.85/2022

Between: **Unique Hospital, Rep. by its Managing Partner, Dr. Ch.Bhaskara Rao.** --Complainant.
And: **The Toyota Kirsoskar Motor Private Limited Bangalore - Karnataka - 560001 & others** --opposite parties.

To the Opposite parties No.3&4:
1. Subrahmanyam Maganti, Managing Director, Leela Krishna Auto Mobiles Private Limited, D.No.164/1, Paradesipalem, N.H.5, Madhuravada, Visakhapatnam
2. Leela Krishna Auto Mobiles Private Limited, Rep. by its Managing Director, D.No.27-33-46, Vudavallivari Street, Gover norpeta, Vijayawada - 520003

నోటీస్

యిందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు కేసులో కంప్లెనెంట్ మీపై కోర్టులో కేసువేసి యున్నారు సదరు కేసులో మీకు నోటీస్ నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డర్ వేసియున్నారు. కావున **తేదీ 10-07-2023 దీన ఉదయం 10-30 ని॥ లకు** మీరు స్వయంగా గాని లేదా వకీల ద్వారా గాని పై కోర్టులో హాజరు కావలెను లేనియెడ మీ పరోక్షమును కోరువారు తీర్మాణంచబడును.

బగాది రామమోహనరావు
వాది తరుపు న్యాయవాది,
శ్రీకాకుళం.

టెస్ట్ క్రికెటర్ భరత్‌కు ఘన సత్కారం



భరత్‌ను సత్కరిస్తున్న ఎసిఎ, విడిసిఎ ప్రతినిధులు

ప్రజాశక్తి పిఎం పాలెం: దీక్ష, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని టెస్ట్ క్రికెటర్ కెఎస్ భరత్ అన్నారు. శుక్రవారం విడిసిఎ ఆధ్వర్యంలో భరత్‌ను ఎసిఎ విడిసిఎ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ప్రపంచకప్ క్రికెట్‌లో ఆడడమనే తన కల సాకారమైందని, దీనికి ఎసిఎ - విడిసిఎ మద్దతు ఎంతో ఉందన్నారు. కీపింగ్ చేయడం తనకిష్టమని, ఆటలో దాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తున్నానన్నారు. ఎసిఎ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎసిఎ తరుపున భరత్‌లాంటి మరింత మంది ఆటగాళ్లను తయారు చేయడమే లక్ష్యమన్నారు. విడిసిఎ అధ్యక్షుడు విష్ణు కుమార్‌రాజు మాట్లాడుతూ విశాఖ క్రుడాడు అంతర్జాతీయ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోచ్ కృష్ణారావు, సిఇఒ శివ రెడ్డి, పార్థసారధి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకం అందిస్తున్న శుభ

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార జివిఎంసి పాఠశాలలో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మురళీనగర్ వనిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్, నోట్‌బుక్స్, శుక్రవారం పంపిణీ చేశారు. పది ఫలితాల్లో ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ. 15 వేలు ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి శుభ, హెచ్‌ఎం బ్రహ్మాజీ, వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ప్రభా శర్మ, కార్యదర్శి రోజారాణి, కోశాధికారి షీలా రమణి, ఉపాధ్యక్షురాలు, పొందూరు ప్రభావతి, బిందురాణి, శిరీష భానుమతి, పద్మావతి పాల్గొన్నారు.

4న కుంచుమాంబ పండగ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామ్ గోపాల్ , రామచంద్రరావు.

ప్రజాశక్తి- మాధవధార : మాధవధార కుంచమాంబ అమ్మవారి పండగ వచ్చే నెల నాలుగవ తేదీన నిర్వహించనున్నట్లు మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్ గోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం మాధవ యువజన సమాజం ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 29న పండుగ చాటింపు, 30న అమ్మవారు సంత, ఒకటిన సత్తెమ్మకు, 2న మరిడమ్మకు, 3న తోలేళ్ల పండుగ, 4న కుంచమాంబ ప్రధాన పండుగ, 11న మారువారం, 13న కనకమహాలక్ష్మి అమ్మవారి పండుగ, 16న కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగను నిర్వహిస్తా మన్నారు. కార్యక్రమంలో పేడాడ పాండురంగా రావు, వావిలాపల్లి వెంకటరావు, సనపల ధనుంజయ స్వామి, కనమటి రఘు. సనపల గోవిందరాజు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్ బదిలీ

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ గోవిందరావును విశాఖ కెజిహెచ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. 14ఏళ్లపాటు ఆనందపురం పిహెచ్‌సిలో సేవలు అందించిన . గోవిందరావు బదిలీపై సహచర సిబ్బంది, స్నేహితులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపి, ఘన వీడ్కోలు పలికారు.

నీతి, నిజాయితీతో ఉన్నత శిఖరాలకు..

50 ఏళ్ల ప్రజా ప్రస్థాన ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఆత్మీయ సమ్మేళనంలో భార్య ఉషతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : నీతి, నిజాయితీ ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, తన జీవితంలో అదే జరిగిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శుక్రవారం రుషికొండ ఏ1 గ్రాండ్‌లో వెంకయ్యనాయుడు 50ఏళ్ల ప్రజా జీవనం, సేవ, అనుబంధంపై సహచర బృందంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా, రాజకీయ జీవితంలో తన ఎదుగుదలకు సహకరించిన తన సతీమణి ఉష తో పాటు ఇతరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా జీవనంలో సమయపాలన అవసరమన్నారు. దేశం ముందకు వెళ్లాలంటే ఎవరి పని, బాధ్యతలను వారు చిత్తశుద్ధితో నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లోతనకు వెంకయ్యనయుడు దిశానిర్దేశం చేశారన్నారు. రాజకీయ జీవితంలో ఎలా మసలుకోవాలనే విషయాలను వెంకయ్యనాయుడును చూసి తాను నేర్చుకున్నానన్నారు. స్నేహితులంటే ప్రాణాలిచ్చి అభిమానించే వెంకయ్యనాయుడుతో ఒక్కసారి ప్రయాణం చేస్తే, ఎక్కడకెళ్లినా బతికేయగలమన్న జీవిత పాఠాలను నేర్చుకోవచ్చన్నారు. 50ఏళ్ల రాజకీయ, ప్రజాప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

జ్యూట్‌మిల్లు స్థలాలు కొని మోసపోవద్దు : టిడిపి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యం అమ్మకానికి పెట్టిన స్థలాలను కొని ప్రజలు మోసపోవద్దని టిడిపి జిల్లా కార్యదర్శి పిట్టా సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికార వైసిపి కనుసన్నల్లోనే చిట్టివలస జ్యూట్‌మిల్లు స్థలాలను కొంతమంది దళారుల ద్వారా అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జ్యూట్ కార్మికులకు పూర్తిగా నష్ట పరిహారం చెల్లించకుండానే ఇప్పటికే ఆస్తులను అమ్మకానికి పెట్టిన యాజమాన్యంపై కోర్టుల్లో కేసులు నమోదౌతున్నాయన్నారు. దళారుల ప్రమేయంతో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న భూముల్లో ప్రభుత్వ బంజర్లు, నదీగర్భాలు, చెరువు లు, కోనేర్లు,గ్రామ కంఠం స్థలాలు ఉన్నాయని, వాటిని కొని నష్టపోవద్దని సూచించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.ఏళ్లతరబడి క్వార్టర్స్‌లో ఉన్నవారికి ఖాళీ చేసేఉరుకునేది లేదన్నారు. సమావేశంలో టిడిపి టిడిపి వార్డు అధ్యక్షులు త మ్మిన సూరిబాబు, బడిగంటి నీలకంఠం, గిడుతూరి శ్రీనివాసరావు, జోగ సన్యాసిరావు పాల్గొన్నారు

రక్తదాన శిబిరం విజయవంతం



దోనర్ సర్టిఫికెట్లతో గంగవరం పోర్టు ఉద్యోగులు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో పోర్టు ఆవరణలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి పైగా పోర్టు ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధి మాట్లాడుతూ, పోర్టు సామాజిక సేవా కార్యక్రమాల్లో రక్తదాన శిబిరం నిర్వహించామని, దీనికి పోర్టు ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొని, రక్తదానం చేశారన్నారు. పోర్టు పరిధిలోని ప్రజల మౌలిక అవసరాలు, జీవనోపాధి, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను బాధ్యతగా సిఎస్ఆర్ నిధులతో చేపడుతున్నట్లు వెల్లడించారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ లబ్ధి

ప్రజాశక్తి - సీతమ్మధార :ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. శుక్రవారం సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఅవుట్ లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తున్నారని, ఇంకా అర్హులై ఉండి తప్పిపోయిన వారిని గుర్తించి వారికిలబ్ధి చేకూరుస్తామన్నారు. అలాగే వివిధ రకాల ధ్రువీకరణలు, 11 ప్రజాసేవలను ఎటువంటి రుసుం లేకుండా అందిస్తామన్నారు

ఆనందపురం: అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చాలన్న సంకల్పంతో వైసిపి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన జగనన్న సురక్షలో మాట్లాడుతూ, నెలరోజుల పాటు చేపట్టే కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లిసమస్యలను తెలుసుకుంటారని, అర్హులకు గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రమణమ్మ, రామారావు, పంచాయతీ సెక్రెటరీ శ్రీరాంమూర్తి పాల్గొన్నారు

పద్మనాభం : వర్చువల్ విధానంలో సిఎం జగన్ ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాంబాబు, ఇతర అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సిబ్బంది తిలకించారు.

పలుచోట్ల గడపగడపకూ...

ప్రజాశక్తి - ఆరిలోవ :13వ వార్డు ఆరిలోవ కాలనీ, పాండురంగాపురంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల గడపగడపకూ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు.

సీతమ్మధార : 25వ వార్డు రాజేంద్ర నగర్ హరిజనవీధి, కనకమ్మవారు వీధి ప్రాంతాల్లోఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, 25వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు శ్రీను, కర్రి మురళీ కృష్ణారెడ్డి, సానబోయిన సురేష్,బోగవల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, ముమ్వల సంతోష్, సమ్మెట్ల వెంకటేష్, యం.సునీల్, రాము పాల్గొన్నారు.

ఆనందపురం : గంభీరం పంచాయతీ బోయిపాలెంలో గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా తనకు ఇళ్లు మంజూరు చేయలేదని పాట లక్ష్మి ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైస్‌ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ ఎల్.రామారావు, పాడ్రంకి శ్రీ ను, శ్రీకాంత్‌రాజు, బంక సత్యం, మణిశంకర్ నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు డెకార్స్‌లో అగ్నిప్రమాదం

- భారీగా ఆస్తినష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైజాగ్ కార్ డెక్కర్స్‌లో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్దఎత్తున పొగలతో మంటలు వ్యాప్తి చెందడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దుర్వాసనతో కూడిన పొగలు భారీగాకమ్ముకోవడంతో అసలేం జరిగిందో తెలియక స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకితెచ్చేందుకు శ్రమించారు. ముఖ్యంగా పక్కనే క్యాస్ట్రాల్ ఇంజన్ ఆయిల్ దుకాణానికి మంటలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అదే జరిగితే ఆయిల్ డబ్బాలకు మంటలు వ్యాపించి ఉంటే ప్రమాదతీవ్రత భారీగా ఉండేదని పలువురు భయపడ్డారు. మరోవైపు మెయిన్‌రోడ్డు, నేషనల్ హైవే కావడంతో వాహనరాకపోకలు కూడా అధికంగానే ఉంది. కాగా ప్రమాదానికి కారణాలు, ఆస్తినష్టం వివరాలు తెలియరాలేదు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని గుల్లిపాడు – నర్సీపట్నం రైల్వే స్టేషన్ పరిధిలో బోధిగల్లం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం రైలు కిందపడి కొత్తపేటకు చెందిన మునసల నాగేశ్వరరావు (40) ఆత్మహత్య చేసుకున్నాడని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందని ఎస్ఐ వెల్లడించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

రిజర్వాయర్‌లో మునిగి యువకుడు మృతి



మృతుడు బాలగంటి సురేంద్ర

ప్రజాశక్తి -ఆనందపురం: స్నేహితులతో సరదాగా వచ్చి, గంభీరం రిజర్వాయర్‌లో యువకుడు మృత్యువాత పడిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి. విశాఖపట్నం, పితాని కాలనీకి చెందిన జడ్డి బడిగంటి బాల సురేంద్ర (24)గంభీరం రిజర్వాయర్‌లో మునిగి మృతి చెందాడు. హైదరాబాదు గవర్నర్ బంగ్లా దరి వాసవపల్లి రెస్టారెంట్ సర్వ్యూట్ హౌస్ ఓనరు చిట్టెం సుధీర్, పోలిదాస్ నాగేంద్ర, సతీష్ స్నేహితులు వచ్చిన సందర్భంగా వారితో రిజర్వాయర్‌కు వెళ్లిన సురేంద్ర, ఈతకు దిగి లోతుకు వెళ్లి మునిగిపోయాడు. స్నేహితుల సమాచారం మేరకు స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీసారు. మృతుడు తండ్రి సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : 14ఏళ్లలోపు పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పూర్ణిమ అన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రెండ్ సంస్థ చేపట్టిన టిఫా ప్రాజెక్ట్‌లో భాగంగా క్షయవ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లల్లో రెండు వారాలు మించి దగ్గు ఉండడం, సాయంకాల సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం, మెడభాగంలో చిన్న పిక్కలు రావడం వంటి లక్షణాలుంటే ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు పొందాలన్నారు. సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణి కుమార్ అధ్యక్షతన జరిగినసదస్సులో వైద్యులు కీర్తి, ప్రదీప్, ఫ్రెండ్ సంస్థ ప్రతినిధులు సింహాచలం, శ్రీకాంత్, సిబ్బంది ప్రేమ్‌కుమార్, చక్రవర్తి, రవి పాల్గొన్నారు

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన.. వినతి అందజేత


రంగుమారిన నీటిని అధికారులకు చూపిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ :జివిఎంసి కుళాయిల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 12వ వార్డు లీలాసుందరయ్యనగర్ ప్రజలు వార్డు సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలో డంపింగ్ యార్డు ఉండడంతో భూగర్భ జలాలు కలుషితమౌతుండగా, అదే నీటిని జివిఎంసి సరఫరా చేస్తోందని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. వార్డు కార్పొరేటర్కు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే చర్యలు చేపట్టకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సచివాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, కార్యవర్గ సభ్యులు బి.సూర్యమణి, బి.కాంత, ఎం.సత్యవతి, అరుణ, దేవుడమ్మ, రత్నం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వామీజీ ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి

ఐద్వా ఆధ్వర్యాన రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ఐద్వా, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : బాలికను లైంగికంగా వేధించిన జ్ఞానానంద ఆశ్రమం పూర్ణానంద స్వామీజీ ఆస్తులు వెంటనే స్వాధీనపరుచుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం, సుజాతనగర్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వామీజీలు పెట్రేగిపోతున్నారని,పోక్సో చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి, ఆశ్రమాల ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్న స్వామీజీలను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు ఆందోళనలో సిపిఎం జోన్ కార్యదర్శి బి రమణి, ఐద్వా నాయకులు రజని, పద్మ, సిఐటియు నేత అప్పలనాయుడు పాల్గొన్నారు.

బిఆర్‌టిఎస్ పనుల అడ్డగింత

నిర్వాసితులకు అధికార, విపక్షాల సంఘీభావం


పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు, నేతలు

ప్రజాశక్తి-సింహాచలం: నష్ట పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడాన్ని నిరసిస్తూ పాత గోశాల వద్ద బిఆర్‌టిఎస్ పనులను నిర్వాసితులు అడ్డుకున్నారు. మూడు రోజులుగా నిర్వాసితులతోపాటు వారి పక్షాన పలుపార్టీల నేతలు, ప్రజాసంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ, అధికారుల నుంచి ఎటువంటి స్పందన, చర్యలు లేకపోవడంతో పనులను నిలుపుదల చేశారు. నిర్వాసితులకు టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, తెలుగు యువత అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, వైసిపి నాయకులు కొలుసు ఈశ్వరరావు, లంక సత్తిబాబు, అడివివరం పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి అప్పలస్వామి, గంట్ల కిరణ్ జనసేన నేత ఎం.సూరిబాబు తదితరులు సంఘీభావం తెలిపారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించే వరకు ఐక్యపోరాటం

30న జివిఎంసి వద్ద మహాధర్నా
రౌండుటేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి -గాజువాక : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలన్న డిమాండ్‌తో ఈ నెల 30న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించాలని వామపక్ష పార్టీలు తీర్మానించాయి. శుక్రవారం గాజువాక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలతో పేద, మధ్యతరగతి వర్గాలపై మోయలేని భారం పడుతోందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణమే తగ్గించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ గాజువాక జోన్ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం వాడిన విద్యుత్‌కు కాకుండా, ఎపుడో పదేళ్ల క్రితం వాడిన దానికి కూడా ఇపుడు ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇష్టారాజ్యంగా బిల్లులు పెంచడం దుర్మార్గమన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు కె.మల్లయ్య మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించేవరకు ఐక్యపోరాటం చేస్తామని, ప్రభుత్వాల మెడలు వంచి తీరుతామని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచిన గత ప్రభుత్వాలకు పట్టినగతే జగన్ ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు ఎ.లోకేశ్వరరావు, అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, లక్ష్మణరావు, మహిళా నేత పిల్లా పద్మ పాల్గొన్నారు.

చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


సంఘీభావం వ్యక్తం చేస్తున్న బిసి సంక్షేమసంఘం నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటరమణ కోరారు. ఎపి బిసి సంక్షేమ సంఘం నేతృత్వంలో 'సంఘం బలోపేతం, సమస్యల పరిష్కారం, సంక్షేమ తదితర అంశాలపై సంఘం నేతల ఉత్తరాంధ్ర పర్యటనపై చర్చించేందుకు శుక్రవారం పౌర గ్రంథాలయంలో సమావేశమయ్యారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 70శాతమున్న బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బిసిలంతా గళం విప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్ మాట్లాడుతూ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కష్ణయ్య ఆదేశాల మేరకు వచ్చేనెలలో బిసిల గర్జన పేరుతో కార్యక్రమాన్ని విశాఖలో చేపడతామన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు, హైకోర్టు న్యాయవాది డాక్టర్ వేముల బేబి రాణి,కార్యదర్శి కె.కిషోర్, నేతలు పోలవరపు నరసింహారావు, పితాని ప్రసాద్, సిటీ బీసీ విద్యార్థి సంఘం నేత బర్ల సురేష్‌కుమార్ యాదవ్, బ్రహ్మ కాగితాల రామారావు గౌడ్, పోలవరపు నర్సింగరావు, డాక్టర్ వై.వెంకటనాయుడు, రామారావు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ రోడ్డు పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్, వైసిపి నేత రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం పరిధిలోని జివిఎంసి 45 నుంచి 51 వార్డుల పరిధిలోని గిరిప్రదక్షిణ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణం, ఆధునీకరణ పనులకు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గిరిప్రదక్షిణ రోడ్డును రూ.4.48 కోట్ల జివిఎంసి నిధులు, రూ.4.40కోట్ల 15వ ఆర్థికసంఘం నిధులతో ఆధునీకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, జెడ్‌సి ఆర్‌జివి కృష్ణ, ఇఇ శ్రీనివాస్, డిఇఇ భరణి, ఎఇలు అర్చన, గుప్త, రమణమ్మ, రాష్ట్ర నాయకులు కిరణ్ రాజు,పేడాడ రమణి కుమారి, శ్రీకాంత్ రాజు, వార్డు అధ్యక్షులు నీలి రవి, పి.సునీత, డైరెక్టర్లు పైడి శ్రీను, ఎన్.రవి కుమార్, దడ్డి రమేష్, ప్రసన్నరెడ్డి పాల్గొన్నారు.

రూ.కోటితో ఇండోర్ స్టేడియం ఆధునీకరణ

గాజువాక : జివిఎంసి 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంను రూ.కోటితో ఆధునీకరించనున్నట్లు మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. శుక్రవారం ఆధునికీకరణ పనులకు స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా స్టేడియంలో ఫ్లోరింగ్ దెబ్బతిని, క్రీడాకారులకు సాధనకు ఇబ్బందిగా ఉందన్నారు. దీన్ని ఇంటర్ లాకింగ్ రబ్బరుతో పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఈతకొలను త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కొండవాలు ప్రాంతాలో ప్రధాన గెడ్డలను రూ.రెండు కోట్లతో ఆధునికీకరిస్తున్నట్లు వెల్లడించారు. 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, జివిఎంసి ఇఇ ప్రసాదబాబు, డిఇ ఎంఆర్ఎస్ అప్పారావు, ఎఇ గణపతిసూర్యారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ గోపాల్, వార్డు అధ్యక్షప్రధాన కార్యదర్శులు లోకనాథం, పెద్దింటి మంగునాయుడు, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్, అవంతి పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ మార్గం పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న సిపి త్రివిక్రమ్ వర్మ

ప్రజాశక్తి- సింహాచలం :వచ్చేనెల రెండో తేదీన గిరిప్రదక్షిణ జరిగే మార్గాన్ని నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శుక్రవారం పరిశీలించారు. గిరిప్రదక్షిణ జరిగే ప్రాంతాలను, పాత అడవివరం నుంచి తొలి పావంచా వరకు రోడ్డును కాలినడకన కలియతిరిగి పరిశీలించారు. గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రతాపరమైన, ఇతరత్రా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గతేడాది గిరి ప్రదక్షణ జరిగిన విధానాన్ని, అప్పట్లో తీసుకున్న చర్యలు, తలెత్తిన సమస్యలను పోలీస్ కమిషనర్‌కు దేవస్థానం ఇఇ రాంబాబు, ఎఇ హరిరాజు వివరించారు. అనంతరం సింహగిరి పైకి వెళ్లి, అక్కడి పరిస్థితులను సిపి పరిశీలించారు.

కరెంట్ ఛార్జీలు తగ్గించాలని నిరసన


నిరసన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి :పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎంఆధ్వర్యంలో కార్మికనగర్, వీరనగర్, అప్పల నరసయ్య కాలనీ, చైతన్య నగర్‌లో నిరసన చేపట్టారు.

సిపిఎం జోన్ కార్యదర్శి బి. రమణి మాట్లాడుతూ సర్దుబాటు, ట్రూఅప్ ఇతరత్రా పేర్లతో విద్యుత్‌ఛార్జీలు పెంచి, సామాన్యులపై భారం వేయడం దుర్మార్గమన్నారు. వేళాపాళాలేని విద్యుత్ కోతలతో ఒకవైపు ఇబ్బందులకు గురిచేస్తూ, మరోవైపు ఛార్జీల వడ్డనపై మండిపడ్డారు. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హెచ్చరించారు.

సిపిఐ మహిళా నేతపై దాడి చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : వెంకోజీపాలెం జ్ఞానానందా ఆశ్రమం వద్ద బుధవారం మహిళా విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహిస్తున్న సమయంలో మహిళా నేత వనజాక్షిపై చేయి చేసుకున్న మహిళా ఎస్ఐ దివ్య జ్యోతిని సస్పెండ్ చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో గాజువాక బస్‌స్టాప్ వద్ద బాధితురాలితో కలిసి నిరసన చేపట్టారు. జ్ఞానానంద ఆశ్రమంలో చోటుచేసుకున్న ఘటనలపై శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై ఎస్ఐ దివ్యజ్యోతి దురుసుగా ప్రవర్తించడం, చేయిచేసుకోవడం హేయమన్నారు. తక్షణమే తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. అచ్యుతరావు, నాయకులు పోలయ్య, జి. ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, తాండ్ర కనకరాజు, మహిళా నేతలు వనజాక్షి, పద్మ పాల్గొన్నారు

రోల్ మోడల్‌గా గాజువాక


విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం 71, 72 వార్డుల పరిధిలో రూ.92 లక్షలతో పోలీస్‌స్టేషన్, శ్రీనగర్ కూడళ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాజువాక సమగ్రాభివృద్ధికి లక్షలాది రూపాయలు కేటాయించామని, అందులో భాగంగా వంద అడుగుల రోడ్డు జంక్షన్; శ్రీనగర్ జంక్షన్ విస్తరణతో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు ఉరుకూటి చందు, రాజాన రామారావు, ఎజె.స్టాలిన్, జెడ్‌సి పి.సింహాచలం, స్థానిక నాయకులు సాలాపు రామారావు, పుర్రె సత్యనారాయణ, జి.ఆనంద్, ఎఇ సౌజన్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేళ్ల డిగ్రీ విధానంపై అవగాహన

ప్రజాశక్తి -ములగాడ : డిగ్రీలో చేరే విద్యార్థి నాలుగేళ్ల తర్వాత ఉద్యోగంతో బయటకు వెళ్లాలనే ధ్యేయంతో ప్రవేశపెట్టిందే సింగిల్ మేజర్ సబ్జెక్టు నాలుగేళ్ల డిగ్రీ విధానమని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అన్నారు. శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ, విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛను అందించే విధంగా ఈ విధానం ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి మాట్లాడుతూ నాలుగేళ్లలో విద్యార్థి మేజర్ సబ్జెక్టుకు సంబంధించి 21 పేపర్లు విద్యార్థి చదువుతాడని, దీనివల్ల అవగాహన శక్తి పెరిగి, పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తాడన్నారు. సదస్సులో వలీషా, ప్రియ, జయశ్రీ, సిస్టర్ జయశీల, సిస్టర్ జానీస్, లలిత పాల్గొన్నారు.

కోటీ పది లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు

◆ ముఖ్యమంత్రి దృష్టికి అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు సమస్య

◆ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాష్ట్రంలో కోటి 46 లక్షల కుటుంబాలు ఉండగా, వాటిలో కోటి పది లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు డిబిటి పద్ధతి ద్వారా చేరుతున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. ఎలమంచిలి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా విజయోత్సవ కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల కాంప్లెక్స్ ఆవరణలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, గౌతమ బుద్ధుడు, జ్యోతిరావు పూలే విగ్రహాలను వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి ఆవిష్కరించారు. సభ వేదికపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన ఎమ్మెల్యే కన్నబాబు రాజును సత్కరించారు. అనంతరం జరిగిన సభలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి 40 రోజులలో పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం సుబ్బారెడ్డి, గుడివాడ అమర్నాథ్, బివి.సత్యవతితో పాటు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడు ప్రసాద్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, పాయకరావుపేట, పెందుర్తి ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, అన్నంరెడ్డి అదీప్‌రాజు తదితరులను సాలువలతో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు కోన సంధ్య బుజ్జి, మల్ల జయలక్ష్మి, బోదేపు గోవింద, జెడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, పి.వాసు, వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు, అచ్యుతాపురం సర్పంచ్ కె.విమల నాయుడు, 4 మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

సమస్యలపై సుబ్బారెడ్డికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం ప్రాంత ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అచ్యుతాపురం మండల కేంద్రానికి శుక్రవారం వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డికి సిపిఎం వినతిపత్రం అందజేసింది. ఈ మేరకు సిపిఎం అచ్యుతాపురం, రాంబిల్లి మండల కన్వీనర్లు ఆర్.రాజు, జి.దేవుడునాయుడు, నాయకులు కర్రి అప్పారావు, కె.సోమునాయుడు శుక్రవారం సుబ్బారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అచ్యుతాపురం ఎస్ఇజెడ్, నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్ఇజెడ్ పరిశ్రమల్లో నిర్వాసితులకు 75శాతం ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించని పరిశ్రమలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోనే అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక మత్స్యకారులకు ఏపీఐఐసీ చెల్లించాల్సిన ప్యాకేజీ పరిహారాన్ని వెంటనే చెల్లించాలని తెలిపారు. పూడిమడకలో జెట్టీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, అచ్యుతాపురం అనకాపల్లి రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు, దుకాణాలు కోల్పోయి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తక్షణమే రహదారి నిర్మాణం చేపట్టాలని, ప్రమాదాలను అరికట్టాలని, అచ్యుతాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల, ఐటిఐ, పాలిటెక్నిక్ వంటి విద్యాసంస్థలు నెలకొల్పాలని కోరారు. జిల్లాలో ఉన్న పంచదార ఫ్యాక్టరీలను ఆధునికీకరించి క్రషింగ్ చేపట్టాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై వినతి

రాంబిల్లి : శుక్రవారం అచ్యుతాపురం వచ్చిన టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సిపిఎం నాయకులకు నేవీ నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు మాట్లాడుతూ తమ సమస్యలపై నేవల్ బేస్ నిర్వాసితులు అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ నేవీ నిర్వాసిత మేజర్ కుమారులు, కుమార్తెలకు ప్యాకేజీ పూర్తిగా అందించలేదన్నారు. ఇటీవల 8 గ్రామాల నిర్వాసితులు 157 రోజుల పాటు ఆందోళన చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు రాతపూర్వకంగా అంగీకరించినా ఆ సమస్యలను నేటికీ పరిష్కరించలేదని తెలిపారు. ఆ హామీలు అమలు చేయకపోవడంతో మత్స్యకారులు వేటకు వెళ్లడానికి అవకాశం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిహెచ్.నూకన్న, సిహెచ్ నూకరాజు, చేపల తాతయ్య పాల్గొన్నారు.



నేవీ నిర్వాసితులు, అచ్యుతాపురం మండల సమస్యలపై వినతిపత్రాలు ఇస్తున్న సిపిఎం నేతలు

మిగిలి ఉన్న అర్హులను గుర్తించి పథకాల అమలు

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనం పొందని లబ్ధిదారులను గుర్తించి వాటిని అందచేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వాలంటీర్లు జూన్ 24 నుంచి 30 వరకు ప్రతి ఒక్క ఇంటికి వెళ్ళి జగనన్న సురక్ష కింద డేటా ఎంట్రీ చేసి, అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభించిన జగనన్న సురక్ష పథకాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులు తిలకించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కింద జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లకు ఇప్పటికే మండల పరిధిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో శిక్షణతో కూడిన అవగాహన కలుగ చేసినట్లు తెలిపారు. జగనన్న సురక్ష పథకంలో ఉచితంగా అందించే 11 రకాల సేవలకు సంబంధించి అవగాహన కల్పించడం, ఇంటింటి సర్వే సందర్భంలో డేటా ఎంట్రీకి చెందిన ఫార్మెట్ లను అందజేసినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, డివిజనల్ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ సి.వెంకటరమణ, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్ని కృష్ణ, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి పి.మంజులావాణి, శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మి రామకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ రవి, జెసి జాహ్నవి తదితరులు

తుమ్మపాలలో...

మండలంలోని తుమ్మపాల గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వైఎస్సార్ కళ్యాణ మండపంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బీశెట్టి జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ఇలా 9 రకాల సర్టిఫికెట్లతో పాటు సమూలంగా సమస్య పరిష్కారానికి ఈ జగనన్న సురక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపిటిసిలు పంచదార్ల కన్నారావు, వడ్డాది అశోక్, పస్నీరు వెంకటలక్ష్మి, వైస్ సర్పంచ్ చదరం చిన్న, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌పి నుండి కారుణ్య నియామక పత్రాలు అందుకున్న దృశ్యం

కారుణ్య నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

మృతి చెందిన ఇద్దరు హోమ్ గార్డ్స్ కుటుంబాలకు శుక్రవారం ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా కారుణ్య నియామకాల పత్రాలను అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన హోంగార్డ్స్ పోలీసు విభాగానికి చేసిన సేవలను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో హోంగార్డ్స్‌గా పనిచేస్తు ఇటీవల కాలంలో చనిపోయిన హెచ్‌జి 628, రవికుమార్ కూతురు రోహిణికి, హెచ్‌జి 178 వంతల భీష్మ భార్య లక్ష్మీకి ఉద్యోగం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఉద్యోగంలో చేరే మొదటిరోజు ఎంతటి ఉత్సాహంతో విధులకు హాజరు అవుతారో అదే ఉత్సాహం చివరి వరకు కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, డీఎస్పీలు పి.నాగేశ్వరరావు, మళ్ల మహేశ్వరరావు, ఏఓ బి.శారద, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, వెంకట్రావు పాల్గొన్నారు.

25న వివి.రమణ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి

రాజ్యసభ మాజీ సభ్యులు వివి.రమణ శత జయంతి వేడుకలు ఈనెల 25న రింగ్ రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరవుతున్నారన్నారు. స్థానిక వివి.రమణ రైతు భారతి భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వీరభద్రరావు మాట్లాడుతూ వివి.రమణ ఉత్తరాంధ్ర ప్రాంతంలోనే కాక రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ప్రజలందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యులుగా రైతు సంక్షేమానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యులుగా నాటి అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించారన్నారు. రైతులు ఆర్థికంగా బలపడాలంటే పంచదార పరిశ్రమల ద్వారానే సాధ్యమని ఆయన భావించి వాటిపై అధ్యయనం చేసేందుకు విదేశాలకు కూడా వెళ్లే ఎన్నో నూతన ఆవిష్కరణలకు కృషి చేశారని చెప్పారు. కేవలం 15 రోజుల్లో రైతుల భాగస్వామ్యంతో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలో స్థాపించి సహకార స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచారన్నారు. శతజయంతి ఉత్సవాలకు రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి వేగి సూర్యప్పారావు, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, గౌతు శ్యామ్ సుందర శివాజీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో వివి.రమణ కుమారులు విల్లూరి రంగాజీ, విల్లూరి లక్ష్మణరావు, కొణతాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంవిఆర్ ఆధ్వర్యాన ఉచిత తీర్థయాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచితంగా తీర్థయాత్రకు వెళ్లే బస్సును శుక్రవారం స్థానిక నర్సింగరావుపేట ఎంవీఆర్ కార్యాలయం వద్ద ఎంవిఆర్ తనయుడు ముత్యాల సతీష్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం, అన్నవరం, కనకమాలక్ష్మి ఆలయ దర్శనములకు భక్తులను తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి అల్పారం, తాగునీటి వంటి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



తీర్థయాత్ర బస్సును ప్రారంభిస్తున్న ముత్యాల సతీష్

ఆర్థిక లావాదేవీలే కన్నబాబు హత్యకు కారణం

ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం ఊడేరు వద్ద బుధవారం రాత్రి జరిగిన రౌడీ షీటర్ రాజాన కన్నబాబు హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని ఎస్పీ మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌పి కథనం ప్రకారం.... రాజాన కన్నబాబు(43) విశాఖలో జరిగిన హత్య, హత్యాయత్నం, డేకాయిటీ వంటి పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. 2019లో అనకాపల్లి గాంధీనగరం వచ్చి తన తల్లి రామయమ్మ, సోదరుడు శివరామకృష్ణతో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన చిన్ని లక్ష్మణరావు, గాంధీనగర్‌కు చెందిన పందిరి దుర్గారావు, విజయరామరాజుపేటకు చెందిన లోపింటి సురేంద్ర స్నేహితులయ్యారు. చోడవరానికి చెందిన గండి శ్రావణి అనే మహిళ భూ వ్యవహారాల్లో కన్నబాబు తల దూర్చాడు. ఈనెల 21న ముగ్గురు ముద్దాయిలతో కలిసి కన్నబాబు చోడవరం శ్రావణి వద్దకు వెళ్లి భూ వ్యవహారాలు మాట్లాడి తిరిగి అనకాపల్లి బయలు చేరారు. వెంకన్నపాలెంలో మద్యం బాటిల్ తీసుకొని ఊడేరు పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో నలుగురు మద్యం సేవించారు. మృతుడు కన్నబాబు చిన్నిలక్ష్మణరావుకు చెల్లించాల్సిన లక్ష రూపాయలు అప్పు విషయమై ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో లక్ష్మణరావు కర్రతో కన్నబాబు తలపై, శరీరంపై బలంగా మోదాడు. పందిరి దుర్గారావు కత్తితో కన్నబాబు తలపై కొట్టడంతో మృతి చెందాడు. మృతుని తమ్ముడు శివరామకృష్ణ అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ దర్యాప్తు చేపట్టారు. 24 గంటల్లోనే ముద్దాయిలను అరెస్టు చేశారు. వారు ఉపయోగించిన కత్తి, కర్రతోపాటు, బజాజ్ పల్సర్, బజాజ్ ప్లాటినా బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.



తనకు ప్రభుత్వం ఇచ్చిన డి.పట్టాను చూపుతున్న కోనేటి రమణ

తప్పులు తడకగా భూముల రీ సర్వే

- రాజాంలో ఒక భూమి మరొకరి పేరుతో నమోదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలో జగనన్న సమగ్ర భూ రీ సర్వే తప్పులు తడకగా ఉందన్న ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. సర్వే ఆదరా బాదరాగా నిర్వహించడంతో పలు గ్రామాలలో రైతుల భూరికార్డులు మారిపోయాయి. దీంతో వారు లబోదిబోమంటున్నారు. జగనన్న సమగ్ర భూ సర్వేలో రికార్డులు మారిపోయాయని రాజాం గ్రామంలోని ఎస్టీ సామాజిక తరగతికి చెందిన కోనేటి రమణ ఆవేదన వ్యక్తం చేశాడు. రాజాం సర్వే నెంబర్ 335/4లో తనకు ఎకరా భూమికి 1993లో ప్రభుత్వం డి పట్టా ఇచ్చిందని, ఈ భూమి తన సాగులో ఉందని తెలిపారు. అయితే రీ సర్వే సమయంలో తనకు ఆరోగ్యం బాగోలేక వెళ్ళ లేకపోయానని, సర్వే అధికారులు తన భూమిని వేరే వ్యక్తి పేరిట నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రికార్డులను సవరించాలని ఆయన కోరారు.

బరితెగించి ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్నాథ్ తన నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క సహకార చక్కెర కర్మాగారాన్ని ఆధునికీకరించకపోగా అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ చరాస్తుల విలువ నిర్ధారించడానికి డేవిడ్ మెక్విన్ అనే ప్రైవేట్ సంస్థ వారిని ప్రభుత్వం పంపడంపై ఆయన మండిపడ్డారు. మంత్రి బరితెగించి ఫ్యాక్టరీ అమ్మకానికి సిద్ధపడడం దారుణమన్నాను. తన ప్రయోజనాల కోసం 13 వేల మంది రైతులను నట్టేట ముంచితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

నేడు కశింకోట మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి -కశింకోట

కశింకోట మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ వివి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎమ్‌పిటిసిలు, జెడ్‌పిటిసి, సంబంధించిన అధికారులు హాజరు కావాలని కోరారు.

ధ్యాన్‌చంద్‌కు నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఒలింపిక్ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎఎంఎఎల్ కళాశాల ప్రాంగణంలో భారతదేశ ఒలింపిక్ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రపంచంలో భారతదేశ గౌరవాన్ని పెంచిన ధ్యాన్ చంద్ ప్రతిభావంతులైన క్రీడాకారుడని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సెక్రెటరీ అమ్మిలోజు శ్రీను, కళాశాల జిమ్ కోచ్ రాజేష్ వర్మ, నిఖిల్, దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

జిల్లా అధికారులు ఆదేశాలతో మండలంలోని తురకలపూడి పిహెచ్‌సిలో శుక్రవారం సిబ్బంది, రోగులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు జి శ్వేత మాట్లాడుతూ వైద్య సిబ్బంది మానసికంగా దృఢంగా, ధైర్యంగా ఉండాలని సూచించారు. సిబ్బందికి పని ఒత్తిడి తీవ్రంగా ఉండటం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒత్తిడిని జయించినప్పుడే విధుల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్సి వైద్యాధికారిని సంధ్యారాణి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అలవెన్సులు ఇవ్వాలని నిరసన



సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలో మండుటెండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గతంలో మాదిరిగా ప్రభుత్వం అలవెన్సులు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం మండలంలోని పి.భోనంగిలో చెరువు వద్ద కూలీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీలకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయాలని కోరారు. గత ఆరు వారాలుగా వేతనాలు రాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంత తీవ్రమైన ఎండలు కాస్తున్న అధికారులు మంచినీరు ఏర్పాటు చేస్తామన్న హామీని కూడా నేటికీ అమలు చేయలేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్లో కేటాయింపులు తగ్గించి పేద ప్రజలకు పొట్ట కొట్టే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. గతంలో మాదిరిగా వేసవి అలవేన్సు 30శాతం, పనిముట్లు అలవెస్సులు, రవాణా ఛార్జీలు, ప్లే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతివారం డబ్బులు, కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ మహాలక్ష్మి, కె అప్పల నరసింహ, జి లక్ష్మి, ఎం భారతి, కే కొండమ్మ, పి దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ఘనంగా ప్రభుత్వ భవనాల ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని పలు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవాలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. చోడవరం ఇందిరా కాలనీలో కమ్యూనిటీ హాల్, మైచర్లపాలెం, కందిపల్లి, గవరవరం, లక్కవరం గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం చోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైసీపీ నాయకులు బైన కుమారీశ్వరరావు, బుద్ధ గంగరాజు, మండల వైసీపీ అధ్యక్షుడు బి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం

జూన్ 26వ తేదీన మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా చోడవరం పోలీసులు శుక్రవారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థలపై అవగాహన ర్యాలీ పట్టణంలో నిర్వహించారు. స్థానిక డిగ్రీ కళాశాల నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా సీఐ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడుతూ యువకుల తమ అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వాటి జోలికి పోకుండా ఉండడమే ఉత్తమ మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు, స్థానిక ఎస్ఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సిసి డ్రెయిన్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలో గొలగాం గ్రామ సచివాలయం పరిధి ఎల్లారమ్మ ఎస్సీ కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలతో సీసీ మెయిన్ డ్రైన్ నిర్మాణానికి ఎంపిపి గొర్లి సూరిబాబు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ శలపురెడ్డి నాగ నరసింగరావు, శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మి రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, వార్డు సభ్యులు గుబ్బల నూకాలతల్లి, ఎస్సీ కాలనీ గ్రామపెద్దలు, పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివకుమార్, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపిపి సూరిబాబు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్

గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 20వ వార్డు కళ్లెంపూడి, కృష్ణాపురం, సీతంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళ్ళెంపూడి గ్రామస్తుల కోరిక మేరకు సీసీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. గ్రామం వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ కావాలని గ్రామస్తుల కోరగా డిపో మేనేజర్‌తో మాట్లాడారు. సీతంపాలెం శ్మశాన వాటిక వద్ద బోరు, డ్రైనేజీ నిర్మాణానికి, కృష్ణాపురంలో 3సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్సు షెల్టర్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పౌరుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు బయపురెడ్డి చినబాబు, సిరసపల్లి నాని, బేతిరెడ్డి రత్నం, పట్టణ వైసిపి అధ్యక్షుడు యాకా శివ, కార్పొరేషన్ డైరెక్టర్లు బషీరున్నీసా బేగం (చోటి), కర్రి శ్రీనివాసరావు, అర్జున వెంకటరావు, సచివాలయాల కోఆర్డినేటర్ తమరాన శ్రీను, మహిళా అధ్యక్షురాలు గణమ్మ పాల్గొన్నారు.

కోటవురట్ల : మండలంలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొసాగుతోంది, శుక్రవారం మండల కేంద్రం కోటవురట్ల 1 సచివాలయ పరిధిలో గవరపేట, జానకిరాంపురంలో పర్యటించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసిల్దార్ జానకమ్మ,స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, హౌసింగ్ పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది-2 సచివాలయం పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నెల రోజులపాటు సచివాలయాలలో వివిధ ధ్రువపత్రాలు ఉచితంగా జారీ చేస్తారన్నారు. గ్రామంలో డ్రైన్లు, సిసి రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రాంబాబు, సర్పంచు, ఉప సర్పంచ్, వైసీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈనెల 24 నుంచి నర్సీపట్నంలో చేపట్టే భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ఈ యాత్రను చేపడుతున్నామని తెలిపారు. నర్సీపట్నం నియోజక వర్గంలో జరిగే యాత్రను కార్యకర్తలు, నాయకులు, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం నుండి ప్రారంభం అవుతుందన్నారు. రైతులకు జరిగిన అన్యాయాలపై నాతవరం మండలం డి.ఎర్రవరం లో సదస్సు, సాయంత్రం నాలుగు గంటలకు బంగార్రాజు సినిమా హాలు వద్ద సదస్సును ఏర్పాటు చేస్తామన్నారు.

గొలుగొండ: ఈనెల 24న నర్సీపట్నంలో చేపట్టే బస్ యాత్రను జయప్రదం చేయాలని మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు కోరారు. ఈ బహిరంగ సభకు గొలుగొండ మండలంలో పంచాయతీల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, మండల అనుబంధ కమిటీలు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఎస్.రాయవరం: ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కళా వెంకట్రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు, లోకేష్‌కు వస్తున్న ప్రజాధారణ చూసి వైసిపి శ్రేణులకు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు.రెండు లక్షల నలభై వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ యువతకు చేసిందేమీ లేదని విమర్శించారు.

పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ, మహానాడులో ప్రకటించిన మేనిఫెస్టోతో వైసిపి నేతలు బయటికి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్దా నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పప్పల చలపతిరావు, గవిరెడ్డి రామునాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, భీమిలి ఇంచార్జ్ కోరాడ రాజబాబు, యలమంచిలి ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి లాలం కాశీ నాయుడు పాల్గొన్నారు.

సైన్స్‌అవార్డుల రద్దు సరికాదు : జెవివి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ సింహాద్రి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సైన్స్ అవార్డులను రద్దు చేయడమంటే శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి అన్నారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ తీసుకున్న నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యువ శాస్త్రవేత్తలకు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను రద్దు చేయడమంటే వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు లేకుండా అవమానించడమేనన్నారు.బడ్జెట్లో శాస్త్ర సాంకేతిక రంగాలకు నిధుల కోత పెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే భారత ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన్ ప్రసార్ సంస్థను భారత ప్రభుత్వం మూసేయాలనే నిర్ణయం తీసుకుందని తెలిపారు. పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ వంటి అంశాలను తొలగించడం విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియకూడదనే భావనతో పాలకులు ఉన్నారన్నారు. మరోవైపు అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, హస్త సాముద్రికం, వాస్తు వంటి అంశాలను పాఠ్యాంశాలలో చొప్పించడం తిరోగమన చర్యకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు క్రమబద్ధంగా, ప్రణాళికా బద్ధంగా శాస్త్రీయతను దూరం చేసి వాటి స్థానంలో తమ భావాజాల, సైద్ధాంతికను అందించాలనే విద్వేష రాజకీయ ఆలోచనలో భాగంగానే సైన్స్ అవార్డుల రద్దు జరిగిందని, ఈ విషయం ప్రజలు గుర్తించాలని కోరారు. ఇలాంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు ఖండించాలని పిలుపునిచ్చారు.

మత్తుతో యువత జీవితాలు చిత్తు

ప్రజాశక్తి-మాడుగుల:మత్తు యువత జీవితాల్లో చిత్తు రేపుతుందని, దీని బారిన పడకుండా జీవితాలను కాపాడుకోవాలని ఎక్సైజ్ సీఐ సింహాద్రి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జరిగిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వాడకం, రవాణా వంటి విషయాల పట్ల వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, పైడిరాజు, షర్మిల, రాజు, నారాయణ, సులోచన, రమణమూర్తి, రామ్ కుమార్, శిరీష, సిబ్బంది సులేమాన్, శ్రీను పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు రైతులకు విత్తనాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల వరి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సరోజిని, నాయకులు పాల్గొన్నారు.

పైలాకు ఘన సన్మానం

ప్రజాశక్తి-మాడుగుల:నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు చేపడుతున్న సేవా కార్యక్రమాలపై శుక్రవారం కింతలి వల్లా పురంకు చెందిన ఆ పార్టీ నేతలు సన్మానం చేశారు. మజ్జి బాబ్జీ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, కొద్ది కాలంగా గ్రామాలలో విద్య, ఆధ్యాత్మిక, క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రజలకు విరాళాలు అందిస్తున్నారని, పార్టీలో ఏ పదవి లేకపోయినా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని కొని యాడారు. పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, తన వంతు సహాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని,పార్టీ అభివృద్ధి కోసం మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాలపు రెడ్డి కొండబాబు, నక్క కొండబాబు, కుసర్ల భీమన్న దొర, బంటు నాయడు, యుద్ధం రాజు, అప్పాలు, కలవల పల్లి సోమన్న దొర తదితరులు పాల్గొన్నారు.



పైలాను సన్మానిస్తున్న టిడిపి నేతలు

ఓటర్ల నమోదు, తొలగింపుపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల:ఓటర్ నమోదు, తొలగింపు, సవరణల పట్ల నిర్లక్ష్యం చేయరాదని నియోజకవర్గ ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల సమావేశం మందిరంలో మండల స్థాయి, బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలువురు అధికారులపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఓటర్ నమోదు, తొలగింపు, సవరణల పట్ల సమగ్ర వివరాలు సేకరించి ప్రక్రియ పారదర్శంగా నిర్వహించకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి అధికారి గ్రామాలలో పర్యటించి పూర్తి సమాచారం సేకరించి అర్హులందరికి ఓటు హక్కు కలిగించాలని తెలిపారు. వలస దారులను గుర్తించడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నట్లయితే వాటిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఎన్నికల డిటి తాతాచార్యులు పాల్గొన్నారు.

ఎంఇఒ 2 జోషికి అభినందనలు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఇటీవల కోటవురట్ల ఎంఈఓ 2 గా బాధ్యతలు స్వీకరించిన పి.జోషిని శుక్రవారం మండల టీఆర్టీయు ప్రతినిధులు మండల రిసోర్స్ సెంటర్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.డేవిడ్ ప్రతాప్, అబ్దుల్లా, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పశు బీమాపై అవగాహన



చీడికాడలో మాట్లాడుతున్నఅధికారులు

ప్రజాశక్తి -చీడికాడ:మండల కేంద్రంలోని పశు వైద్య కార్యాలయం వద్ద వైయస్సార్ బీమా పై పశువైద్యాధికారిణి గాయత్రిదేవి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు బి. ప్రసాదరావు మాట్లాడుతూ, మగ పశువులకు కూడా బీమా వర్తిస్తుందన్నారు. మూడేళ్లకు 30,000 భీమాకు గాను రైతు రూ.384 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వి.మాడుగుల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వి.చిట్టి నాయుడు మాట్లాడుతూ, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా నోడల్ అధికారి , బాను బాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు రాంబాబు ఆధ్వర్యంలో గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు సంబంధించిన రైతులతో స్థానిక పశు వైద్యశాలలో వైయస్సార్ పశు బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి ప్రసాద్ రావు పాడి రైతులతో ఇష్టా గోష్టి చర్చ నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న పశు బీమా పథకాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, పశు సహాయకులు, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

30న పిడిఎస్ బియ్యం వేలంపాట

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలానికి సంబంధించి వివిధ 6ఎ కేసులలో పట్టుబడిన సుమారు 18.041 క్వింటాలు పిడిఎస్ బియ్యాన్ని ఈ నెల 30న వేలం వేస్తున్నట్లు రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రావికమతం ఎంఎల్ఎస్ పాయింట్లో నిల్వ ఉంచిన బియ్యాన్ని వేలం వేయనున్నట్లు తెలిపారు. సంబంధిత వివరాలు జిల్లా పౌరసరఫరా అధికారి, తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్. నాగాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ పాణి శాంతారామ్ మాట్లాడుతూ, గ్రామాల్లో వివాహ సర్టిఫికెట్, కుల, ఆదాయ, మరణ ధృవపత్రం, తల్లిదండ్రులు భూములను పిల్లలకు ఇచ్చే వీలుగా మ్యుటేషన్లు వంటి 11 రకాల సేవలకు టోకెన్లు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతారామ్

27న విచారణ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో బుచ్చంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై ఈ నెల 27న విచారణ చేపట్టనున్నట్లు ఎంపిడిఒ పి.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, బుచ్చంపేట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ పై వచ్చిన ఆరోపణపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలో వేములపూడి మోడల్ స్కూల్లో 7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులకు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సంధ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7,8,9 తరగతులలో మిగులు సీట్లకు రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేయటం జరుగుతుందన్నారు. ఏ పి మోడల్ స్కూల్ వేములపూడిలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పించాలన్నారు.

ఎంపీ నిధులతో ఆట పరికరాలు

ప్రజాశక్తి-కొత్తకోట:అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు నిధులతో ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాలకు ఆట పరికరాలు మంజూరైనట్లు రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఉషారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ,రావికమతం ప్రాజెక్ట్ పరిధిలో సొంత భవనాలు ఉండి, ఆటపరికరాలు పెట్టేందుకు వీలుగా స్థలాలు వున్న కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. వీటిలో కొత్తకోట 4, జీ.చీడిపల్లి, జెడ్. కొత్తపట్నం-2, దొండపూడి నాలుగు కేంద్రాలు అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆట పరికరాల రక్షణ కోసం ఆయా గ్రామాలలో సర్పంచ్, తల్లులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సూపర్వైజర్ విజయ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు విలువైన ఆటపరికరాలు సరఫరా చేస్తున్న దృష్ట్యా వాటి రక్షణకు సహకరించాలని కోరారు. ప్రహరీ గోడ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తకోట సర్పంచ్, ఉప సర్పంచ్ కొన లోవరాజు, పందల దేవా మాట్లాడుతూ, పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ గోవింద్, జి ఎంఎస్‌కె లు రమ్య, కిరణ్ పాల్గొన్నారు.

సారా నియంత్రణకు ర్యాలీ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన బంగారమ్మపేటలో నాటు సారా నియంత్రణకు యువత నడుం బిగించింది. ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలతో శుక్రవారం సమావేశం నిర్వహించి గ్రామంలో నాటు సారా నియంత్రించాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సర్పంచ్ గోసల నర్సమ్మ, ఎంపీటీసీ సభ్యులు చేపల రాజు గురువులు, సచివాలయ పోలీసు అధికారిని సునీత, మత్స్యకార నాయకులు కొవిరి గంగాధర్, కొవిరి వెంకటేష్ ఆధ్వర్యంలో యువత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో సారా నిషేధం చేయుటకు గ్రామస్తులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. నాటు సారా తాగడంతో అనేకమంది రోగాలు బారిన పడి, కుటుంబాలు సర్వనాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈనెల 30వ తేదీ తర్వాత గ్రామంలో నాటు సారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చేపల మురళి, కోడ ఏసు, కొవిరి స్వామి, పేర్ల శ్రీను, యజ్జల కాశీరావు, పేర్ల గోవిందు, సిరిపిన శ్రీను పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న ప్రజాప్రతినిధులు ,యువకులు



విద్యాలయాలకు నెలవు విశాఖ

ప్రజాశక్తి-కలెక్టరేట్: విద్య లేని వాడు వింత పశువు. చదువు మనిషి జీవితాన్ని మారుస్తుందనడంలో సందేహం లేదు. అటువంటి చదువులు అందించే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలకు విశాఖ నగరం కేంద్ర బిందువుగా విరాజిల్లుతోంది. నేటికీ కొంత మందికి చదువు అందని ద్రాక్షగా ఉంది. ప్రాథమిక విద్య ప్రభుత్వ రంగంలో అందుబాటులో ఉన్నప్పటికీ, మాధ్యమిక, ఉన్నత విద్య అభ్యసించాలంటే ప్రైవేటుగా విద్యా సంస్థలే దిక్కు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయగోదావరి, ఒడిశా, చత్తీస్ గడ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలంటే విశాఖకు రావాల్సిందే. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు విశాఖలో నెలకొల్పబడ్డాయి. మరోవైపు విశాఖలో ఐఐఎం,పెట్రో యూనివర్సిటీలు మంజూరయ్యాయి. ఇప్పటికే నగర శివారున గంభీరంలో ఐఐఎం నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. లా యూనివర్సిటీకి సొంత భవనాలను సమకూర్చడానికి అవసరమైన భూములను సబ్బవరం మండలంలో ప్రభుత్వం కేటాయించడంతో నిర్మాణాలు జరుగుతున్నాయి. దేశానికి స్వాతంత్రం రాకపూర్వమే ఆంధ్రా యూనివర్సిటీ, ఆంధ్ర మెడికల్ కాలేజీ, ఎవిఎన్ వంటి డిగ్రీ కళాశాలలతో జాతీయస్థాయిలో విశాఖ విద్యా నగరంగా గుర్తింపు పొందింది. ఇక్కడ చదువుకున్న పలువురు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఆంధ్రా యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీకి డిమాండ్ అధికంగా ఉంది. ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ప్లేస్ మెంట్ కల్పించేందుకు పలు ఐటి కంపెనీలు క్యూ కట్టడమే ఇక్కడి విద్యా ప్రమాణాల నాణ్యతకు నిదర్శనం. ఇంజనీరింగ్‌లోనే కాకుండా పలు కోర్సులను ప్రవేశపెట్టి రాష్ట్రానికి తలమానికంగా ఆంధ్రా యూనివర్సిటీ అలరారుతోంది. అనేక పరిశోధనలకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఘనమైన చరిత్ర కలిగిన ఎయును కేంద్రీయ విశ్వ విద్యాలయంగా మార్చాలన్న డిమాండ్ వినిపిస్తోంది. మెడిసిన్ విద్యలో ఆంధ్ర మెడికల్ కాలేజీకి రాష్ట్రంలోనూ, దేశంలో ఎనలేని ప్రత్యేకత ఉంది. ఈ ఏడాదితో శత వసంతాలు పూర్తి చేసుకుంటున్న ఈ మెడికల్ కాలేజీ, ఎందరో నిష్ణాతులైన వైద్యులను సమాజానికి అందిస్తూ వస్తోంది.వీటితోపాటు గీతం లాంటి యూనివర్సిటీ కూడా విశాఖ సిగలో వెలిసింది. గాయత్రి, నారాయణ, చైతన్య, భాష్యం, రవీంద్ర భారతి, విజ్ఞాన్, కెకెఆర్ గౌతమ్, ఫిట్జీ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు, విశాఖలో అందుబాటులో ఉన్నాయి. వీటికి ధీటుగా స్థానిక విద్యాలయాలు పెన్ స్కూల్, ఒన్ వరల్డ్ స్కూల్, పొలక్ స్కూల్, తదితరవి ఉత్తమ విద్యను అందించడంలో ముందు వరుసలో ఉన్నాయి. రాష్ట్రంతో పాటు తెలంగాణలో ఇంజనీరింగ్ మెడిసిన్ విభాగంలో మంచి ర్యాంకులు సాధించిన ఘనత విశాఖ విద్యార్థుల సొంతం.

జివిఎంసిలో డిజిటల్ విద్య

జివిఎంసి పరిధిలో 150 పాఠశాలలు ఉన్నాయి. అందులో 111 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 17 ఉన్నత పాఠశాలలు, 22 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో కార్పొరేట్ పాఠశాలలకు మించి డిజిటల్ హంగులు సంతరించుకున్నాయి. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అనేక ప్రభుత్వ విద్యా సంస్థలు అన్ని వసతులతో అద్భుతంగా తీర్చి దిద్దబడ్డాయి. భవనాలు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చాయి. దీంతో, ఫీజులు కట్టుకోలేని, సామాన్యుల పిల్లలు విద్యా బుద్ధులు నేర్చుకునే అవకాశాలు అవకాశాలు మెరుగుపడ్డాయి. దీంతో, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు బాగా పెరిగాయి. ఏ స్థాయిలో ప్రవేశాలు ఉన్నాయంటే, సీట్లు దొరకని పరిస్థితి నెలకొంది. ప్రతి విద్యార్థి ల్యాప్ టాప్ వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. మెట్రో రైలు ప్రాజెక్టు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రిషికొండ ప్రాంతంలో ఐటీ రంగం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.